***గీతాంజలి మూర్తి*** చరవాణి: 9849062885; e- gitanjalimurthy47@gmail.com మధురానగర్; హైదరాబాద్- 500038

***దీపావళి 29.10.2016***

"మా అన్నయ్య" – కవితా సంకలనం -- శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్, **సమీక్ష**

**మంచి అన్నలకు 'వందనం' ! మంచి చెల్లెళ్ళకు తమ్ముళ్ళకూ "అభినందనం"**

*మీ జీవనయానంలో*-**నవ్య మలుపులు** *తిప్పుతూ* **దివ్యకాంతులు** *వెదజల్లుతూ,* **భవ్యభవితను** *ప్రసాదించాలని మీకందిస్తున్నా ....*

***దీపావళి శుభాకాంక్షలు***

***శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్ గారు*** బహుగ్రంథ కర్త, స్నేహశీలి. ముఖ్యంగా తమ స్వస్థలం **ఉయ్యూరు** లో సాహిత్య సేవలో, అనేక గ్రంథావిష్కరణలూ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్విరామంగా నిర్వహిస్తూనే, స్వయంగా అనేక గ్రంథాలు రచించి, ప్రచురించి సాహిత్యాభిమాలకందజేస్తూ, ప్రఖ్యాతిగాంచారు. ***నా అదృష్టం కొలదీ***, ఒకసారి హైదారాబాద్ లో ఒక మిత్రుడివద్ద వీరితో పరిచయం ఐన తరువాత ఉయ్యూరు నుండి వారి ***సాహిత్యసౌరభాలను*** నావైపుకూడా ప్రసరింపజేయటం నాకెంతో సంతోషంగా ఉంటుంది.

'**సరస భారతి**' – గబ్బిట వారిచే, ఉయ్యూరు లో స్థాపించబడిన సాహిత్య/సాంస్కృతిక సేవా సంస్థ ***ఉయ్యూరు విశిష్టత*** గురించి పంతుల వెంకటేశ్వరరావుగారు రాసిన కవితలో... ***మాన్యులు గబ్బిటవారు చూపుతున్న*** సాహిత్య సేవాతత్పరతను గురించి ప్రశంసిస్తారిలా: ".. ***గబ్బిటవారు నిల్పిరిట ఖ్యాతిని పెంచగా సాహితీ సభన్, జబ్బలు గట్టిగా చరచి జట్టుగా సత్కవీశులన్ దెబ్బకు నాంగ్లదెయ్యమును తెల్గున కైతలకున్ దిగెన్ గదా...*** " ... ఎందటో పండితులను, కవులను ఉయ్యూరుకు ఆహ్వానించి సన్మానించుతూ గౌరవించటం, వారు ***తెలుగుతల్లికి చేస్తున్న అపార సేవకు*** నిదర్శనం.

ఇటీవలే, వారు అందించిన ***21 వ*** *ప్రచురణ* - '***మధుర సోదరప్రేమల తోరణం*** **'మా అన్నయ్య**' అనే గ్రంథం దీనిని వారు నాపట్ల అభిమానంతో పంపటం, అది చదివిన నేను పొందిన *కమ్మని అభూతులు* ***మనసున మల్లెల మాలలూగించాయి.*** వాటిని మీతోకూడా ఇలా పంచుకొని పెంచుకోవాలని కోరుకుంటూ రాస్తున్నవీ స్పందనలు. ఇక, '**అన్నయ్య**' గురించి ఈ గ్రంథం లోని కొన్ని ***మధురమైన ముచ్చట్లు.*** *చెప్పకుందాం మరి :*

***దుర్గా ప్రసాద్ గారు*** తన కవిత **"మా శర్మన్నయ్య చిరంజీవి" ( 1 ) -** వారి అన్నయ్య ***కొవ్వొత్తి లాంటి*** త్యాగనిరతిని, వినయంగా విన్నవించుకున్నారిలా: ***".....తాను కాలుతూ వెలుగునిచ్చిన కొవ్వొత్తి మా అన్నయ్య, ఇంటికెప్పుడూ దూరంగానే ఉన్నా, మా ఇంటిల్లిపాది గుండెల్లో ఉండేవారు.*** నవులూరి రమేష్ బాబు తన అన్నగురించి రాసిన కవిత - ***" దార్శనిక విక్రాన్త కీర్తి అన్న " (6) - సున్నిత హృదయులను*** కదిలించగలదు: "***ముందున బుట్టి, యాతడు తమోంతక తేజుడు భానుడే యగున్, ముందుగ వచ్చునట్టి కడు మోటగు కష్టములెల్ల తానె, యానందముతో భరించి, తదనంతర సంతతికంతకున్ సుందర సౌఖ్యమంది యిడు చొప్పన వర్తిల్లు***, అన్న యన్నయే !" ***దండిభోట్ల దత్తాత్రేయశర్మ,*** తన "**ఆత్మీయ అనురాగ పుంభావమూర్తి అన్నయ్య**" (11 ) కవితలో, మంచి అన్నను అలతిపదాలలో నిర్వచించారిలా: "***...వస్తువులను పోగేసుకోవటమే అభివృద్ధికి కొలమానమనుకొనే రోజుల్లోనూ, మనుషుల్ని మనసుల్ని ముడివేసుకోవటమే మూలం అన్న అభ్యుదయవాదిలా అగుపిస్తాడు 'మా అన్నయ్య".*** '***నేటి మనిషి 'మర మనిషి***' ఐపోయి మరచిపోయిన మానవసంబంధాల ప్రాధాన్యాన్ని మరొకమారు గుర్తు చేసారీ కవితలో !

**శ్రీమతి గుడిపూడి రాధికారాణి** ***“అనురాగపు కొండ అన్నయ్య”*** ( 12 ) అంటూ తన అన్నయ్యకు అద్భుతంగా ***“కవితా రాజమకుటం పెట్టారిలా..”...*** ***“...నేనూ అన్నయ్యా వీణా తీగలుగా వేరు వేరైనా పలికెడి ఒకే రాగం – అనురాగం;...”*** అంతే కాక “***ఆలయ స్తంభాలుగా వేరు వేరు, మోసేది ఒకే ప్రాకారం – మమకారం*** !” అద్భుతం ! ఆమె మాటలు ముత్యాల మూటలే ఐనాయి. ఇంకా, ఈ !కవితలో: “...***తను చినుకు పడి చిందేసి మట్టిగా నిలిచి, నను ఆహ్లాదపు ఆత్మీయపు పరిమళంగా మలిచి, తను ఆలయ పునాది రాయిగా మిగిలి నను గోపుర శిఖరంగా నిలిపి***, ...” అంటూ తన ప్రియాతిప్రియమైన అన్నప్రేమను ఆకాశానికెత్తేశారు ! ఇంత సున్నితభావాలు కల, ***సోదరి లభించటం*** ఆ అన్నగారికి ‘***దేవుడిచ్చిన వరమే***’ !

భక్తుడు తనకు ‘***పత్రమో, పుష్పమో, పండో, అదీ లేకపోతే, కనీసం ఉద్ధరిణి నీళ్ళయినా ప్రేమతో సమర్పిస్తే, భగవంతుడు మహదానందం పొందుతాడు !***’ అలాగే ఈ చెల్లి, ***శ్రీమతి కందాళ జానకి*** ( 14) తన అన్నపట్ల, ప్రేమాతిశయంతో ఏమంటున్నారో చూడండి : ***“మాకు పసుపు కొమ్మే చాలు, పట్టెడు కుంకుమే చాలు, అన్నలందరికి, మా అన్నలందరికీ మంగళం, శుభ మంగళం !***’.. ప్రేమగల ఆడపడుచులు పుట్టింటినుండి ఆశించేది, ***ఈ మాత్రమేనని*** చాలామందికి తెలిసినదే ! అలాగే మరొక సోదరి, ***శ్రీమతి ముదిగొండ సీతారావమ్మ*** (16) కూడా మనస్ఫూర్తిగా ఏమంటున్నారో చూద్దాం “***తన యనుజుల భవితకొరకు వచ్చు ఆపదలన్నీ దాటి, ముందు నడచు ధర్మమూర్తి..అమ్మా నాన్న పిదప నాదరించెడు వాడు, అన్న యెక్కడగును యతివకెపుడు*** !” ఇంకా, **అన్న** అనే పదానికి **చక్కటి నిర్వచనం** ఇస్తున్నారు: “అత్తింట ఎన్నున్నా పుట్టింటిపై ప్రేమ – వీడదెప్పుడు కాంత వింత గాదు, అమ్మలో సగము **“అ”**, నాన్నలో సగము **“న్న”** – అవి రెండు కలిసిన **“అన్న”** యగును...” ! ఓహ్ ! **‘అన్న’** అంటే అందమైన అర్థాన్ని అలవోకగా అందించారీ చెల్లెమ్మ !

**“దేవుడి వరం అన్న” (17) అనే** కవితలో ***మునగంటి వెంకటాచార్యులు,*** తాను తమ కుటుంబంలో అగ్రజుడు కాబట్టి, అన్న లేని కొరత తనను వేధిస్తూ ఉండేదట ! ఐతే, తన జీవితంలో తనకొక అపురూప ఆత్మీయ మిత్రుడు దొరికాడట ! అతనినే, ఈ కవి ‘అన్నా!’ అని ప్రేమగా పిలుచుకుంటూ ఉంటాడట. వయసు మీదపడి వృద్ధాప్యం తరమగా, హైదరాబాద్ లో ఉన్న కొడుకు వద్దకు చేరటం వలన, ఇద్దరూ దూరమయ్యారు. అయినా ఎప్పుడైనా హైదరాబాద్ వచ్చినపుడు, ‘***నేను భాగ్యనగరం వెళ్ళినప్పుడు, ..నా భాగ్యంగా స్టేషన్ కొచ్చాడు. ఆ మిత్రన్నను చూడగానే గుండె బరువెక్కింది. గొంతు మూగబోయి కళ్ళు చెమర్చాయి’ అంటారు..*** చివరి వాక్యంలో కూడా ఈ ***మిత్రన్నను*** ఆకాశానికెత్తేసారు: “***ఆర్ద్ర హృదయంతో నాకు వీడ్కోలు పలికి – నాకు దేవుడిచ్చిన ఆత్మీయుడైనాడు అన్నయ్య”*** ! ఈ మైత్రీబంధం, అన్నదమ్ముల అనుబంధంగా రూపొందటం వారి అదృష్టం ! **శ్రీమతి సింహాద్రివాణి (18)** తన అపురూప సోదర భావాన్ని అందమైన అక్షరాలలో పొందికగా పోహణించారు: “అన్న ఎపుడూ ***చెల్లి ఆరవ ప్రాణమ్ము – అన్నకున్న ప్రేమ అద్భుతమ్ము... అన్న ఉన్న చెల్లికవనిలో కరువేది – కంటి రెప్పవోలె కాపు కాయు”*** కళ్ళుచెమర్చే ఈ కమనీయభావం ***చెల్లెళ్ళకే*** స్వంతం ! ‘**ఇష్ట దేవత అన్న**’**(19)** అనే తన కవితలో ***శ్రీమతి లక్కరాజు వాణీ సరోజిని***, తన అన్నను ***దేవుడినే చేసారిలా***: “...***కంటి రెప్పలవోలె కాచి కాపాడుచు – వెంటనంటెడి దొడ్డ వేల్పువయ్య......ఆప్తమిత్రునివోలె ఆడిపాడిన రీతి – మరపురాని గాఢమైత్రి మాది... ఎన్ని జన్మలకైన నిను సరిపోలిన – అన్న గానగ జాలనని యందు..”.*** మరొక కవితలో, ఈ తమ్ముడు ***కందికొండ రవికిరణ్*** తన అద్భుత సోదర భావాన్ని “**అరుదైన బ్రహ్మ కమలం” (20) అనే కవితలో** ఎలా గర్వంగా చెప్పకున్నారో చూడండి: “ ***తన చదువు నాపి తమ్ముళ్ళను బడికి పంపి చేయూతైనాడు, అమ్మకు ఇంటి స్థితిగతులు ఒడలు బండ్లుగా మారినపుడు...సహజన్ముల సంతాన యోగ క్షేమమరయునెల్లపుడు ...”*** గొప్ప అన్న,... గొప్ప తమ్ముడు ! శెభాష్ !!

**“మిన్నంటిన గౌరవం అన్న**” (22) అనే గౌరవనీయమైన కవితలో తన సున్నిత భావాలను అక్షరీకరించారు, ***పంతుల వెంకటేశ్వరరావు***, ఇలా: “...నాన్న గారి పిదప నాన్నగా నిలబడి – భుజములన్ బాధ్యత మోయుచుండు... రక్ష కట్టిన చెల్లికి రక్షనిచ్చి, అన్న యన్న పిలుపుకు దానాదమరచి, జీవితాంతమాదుకొనెడు జీవి యితడు అన్నదమ్ముల అనుబంధం అంటే ఇదే కదా !

మరల మరొక చెల్లి, శ్రీమతి పద్మావతి శర్మ, **"అంతా నాకు దేవుడిచ్చిన అన్నయ్యలే !" (24) అనే** కవితలో ***తన తీయని ఊహలలో*** అన్నంటే ఇలా ఉంటాడు అంటున్నారు: "అమ్మకు ఆసరాగా గిలక్కాయలతో ఆడించేవాడు మా అన్నయ్య, ..పట్టరాని కోపమొచ్చినా నాకోసం బావను క్షమించేవాడు....నా జబ్బు తగ్గాలని ఉపవాసాలు చేసి మొక్కు తీర్చుకొనేవాడు..." "నాకు అన్నయ్యలే లేరు..అందుకే ***మీరంతా నాకు దేవుడిచ్చిన అన్నయ్యలు – మా అన్నయ్యలు*** !!". అని ఈ చెల్లెమ్మ అన్న గురించి గీసుకున్న ఊహాచిత్రంతో మురిసిపోతున్నది. ఈ కవిత నిజంగా నా హృదయాన్ని ***కదిలించి కరిగించి కన్నీరొలికించింది.*** ! ఎందుకంటే....ఎందుకంటే... ***నాకూ - తోడబుట్టిన -చెల్లెళ్ళు లేరు*** ! ( ***నా అనుభూతులను*** చివరిలో వ్యక్తం చేస్తాను )

పేరొక కవితలో మరొక సోదరి ***శ్రీమతి వడ్డాది సుభద్ర*** తన అన్నను '**అపర భగీరధుడు అన్నయ్య**' (28) అంటారెందుకో చూద్దామా : "***కన్నవారు దివికేగిన వేళ, సంసార నౌక సంద్రాన ఉన్న వేళ తోబుట్టువుల సుఖమే తనది అన్న వేళ, – స్వార్థం అనే పదం నిఘంటువులో లేనివాడు – నిరాడంబరుడు మా అన్నయ్య...***"

<u>ఈ ***కవితాసంకలన బృందావనంలో***, విరబూసిన ***చెల్లెమ్మల కవితాకుసుమాలు*** ప్రత్యేకతను సంతరించుకున్నాయి.</u>

ఈ కవితలు చదువుతూ ఉంటే ***తోడ బుట్టిన చెల్లెళ్ళు లేని నా నలుగురు ఆప్త మిత్రుల భార్యలూ,*** మరిద్దరూ, '***నా చెల్లెళ్ళుగా***' లభించి, '***అన్నయ్యా !' అని నోరారా పిలిచి***, నన్ను పులకింపజేసిన '***<u>నా అనుభవాలూ – జ్ఞాపకాలూ</u>***' గుర్తుకొస్తున్నాయిలా... నా వివాహం **వరంగల్ లో** 1973 లో జరిగింది. అప్పుడు '***<u>జై ఆంధ్ర ఉద్యమం</u>***' మహోధృతంగా జరుగుతోంది. **తెనాలి నుండి** రెండు కార్లలో ముఖ్యులం కొద్దిమందిమే వెళ్ళటానికి ఏర్పాటు చేసాం. అప్పుడు, ***<u>నా బాల్యమిత్రుని చెల్లెలు,</u>*** తను కూడా ఈ '***అన్నయ్య పెళ్ళికి వస్తానని***' మారాం చేసి, వాడు వద్దంటున్నా, వొప్పించి మాతో వచ్చింది. ముఖ్యంగా, అలా వచ్చి పెళ్లికొడుకుకి పెట్టవలసిన '***బుగ్గన చుక్కను***' తను స్వయంగా ఈ చెల్లెలు, పెట్టి ***నాకు 'చెల్లెమ్మ' లేని లోటును తీర్చింది***. ఆ మధురానుభూతి నాకు సదా స్మరణీయం ! ***<u>మరొక చెల్లెలి ముచ్చట</u>*** ఇది: నేను '**రాంచి**' లో పని చేసేటప్పుడు' మన ఆంధ్ర –ఒరిస్సా సరిహద్దులో ఉన్న ఇచ్ఛాపురం గ్రామస్తులు, వెంకట్రావు దంపతులు, అక్కడ చిన్న వ్యాపారం చేసుకుంటూ, ఉండి, ***తెలుగువారుగా***, పరిచయం అయారు. కొద్ది రోజులలోనే, అతని భార్య, దమయంతి మా ఇద్దరినీ '***అన్నయ్యా !.. వదినా !!***'" అంటూ నోరారా పిలుస్తూ ఉండటం, అలా మా ఇద్దరి కుటుంబాలూ చాలా సన్నిహితం అవటం, మరొక తీయని గుర్తుగా మనసులో స్థిరపడిపోయింది. మా శ్రీమతి అప్పుడప్పుడు, పిల్లల కొరకు, గుంటూరు వెళ్ళినప్పుడు ***ఆ చెల్లెమ్మ*** నాకు అన్నం, టిఫిన్లూ వేళకు చేసి పెడుతూ నన్ను కనిపెట్టుకునిఉండటం ***<u>నేను అడగకుండానే, దేవుడిచ్చిన వరంగా</u>*** భావిస్తాను ! ఆమె ప్రేమగా, '***అది కాదన్నయ్యా...***' అంటూ పిలిచిన పిలుపులు, నాకు ***పంచదార పలుకులే*** అయి ఇప్పటికీ '***వీనుల విందు***' చేస్తూనే ఉంటాయి. '***నాకూ ఒక చెల్లెలుంటే, ఎంత బాగుండును, అని తరచూ అనుకునే నాకు ఆ లోటు వీరి ద్వారా తీరిందని*** *తృప్తి చెందుతాను.*

ఇక్కడ, అలనాటి తెలుగు చిత్రాలలోని ఈ గీతాలు ఉటంకించటం సందర్భోచితమే అనుకుంటాను: "***అన్నయ్య సన్నిధే అదే నాకు పెన్నిధీ...***" (బంగారు గాజులు); "***అన్నా ! నీ అనురాగం, ఎన్నో జన్మల పుణ్య ఫలం, ఓ అన్నా !***' (ఆడ పడుచు).

అన్నలపట్ల అనుజులకుండే ప్రేమానుబంధాలను పై కవితలలో ***తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ*** హృద్యంగా రాసి ***వారు ఆనందించి, మనలను ఆనందింపజేసారని విశ్వసిస్తాను***.. అన్నలందరూ, ఇది చదివి,. ఈ మధుర భావాలను ఆస్వాదించి ***వారి అనుభవాలను గుర్తుచేసుకుని*** ఉంటారని, ఆశిస్తాను అటువంటి ***<u>మంచి అన్నలందరికీ, వందనం, అభివనందనం !!</u>***

వారికిదే, అమూల్యమైన అపురూప **<u>దీపావళి కానుక</u>** అనుకుంటాను.

ఇటువంటి చిర స్మరణీయమైన '***కవితా గుచ్ఛాన్ని***' గ్రంథ రూపంలో అపురూపంగా అందించిన ***శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్ గారికి ధన్యవాదాలతో, సెలవు.***

(***గీతాంజలి మూర్తి*** ) *maaannayya*